

ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా?

పంచాయతీలకు వచ్చిన ఆర్థిక సంఘం నిధుల మళ్లింపుపై ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని కాంగ్రెస్ నేతలు ప్రభుత్వాన్ని నిలదీశారు.

- 9లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.0 /14.8

వాతావరణం

పొగ మంచు కురుస్తుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

‘7వ తేదీలోగా బదిలీలు చేపట్టాలి’



కామారెడ్డి క్రైం: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల బదిలీలు, పదోన్నతులను ఈనెల 7 వ తేదీలోగా చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఐసీడీఎస్ సీడీపీవోలతో అంగన్‌వాడీ కేంద్రాల పని తీరుపై సమీక్షించారు. కేంద్రాల్లో న్యూట్రిషన్ గార్డెన్‌లు సజావుగా ఉండేలా చూడాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి అదనంగా పౌష్టికాహారం అందేవిధంగా చూడాలని పేర్కొన్నారు. సీడీపీవోలు ప్రతినెల 5 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ రమ్య, సీడీపీవోలు శ్రీలత, రుచిష్మ, సునంద, పద్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు.


తగ్గుతున్న భూగర్భ జలాలు

సాక్షి, కామారెడ్డి: భూగర్భ జలాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. నెల వ్యవధిలో 1.23 మీటర్ల మేర తగ్గాయి. జిల్లాలో ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలమట్టం భారీగా పెరిగింది. అయితే ఇటీవలి కాలంలో యాసంగి వరినాట్లు ముమ్మరం కావడంతో నీటి వినియోగం పెరిగింది. దీంతో భూగర్భజలమట్టం తగ్గుతోంది. జిల్లాలో నవంబర్ నెలాఖరులో సరాసరిన 5.84 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా.. డిసెంబర్ చివరినాటికి 7.08 మీటర్ల లోతుకు పడిపోయాయి. అంటే 1.23 మీటర్ల మేర భూగర్భజలాలు తగ్గాయి. గతేడాది డిసెంబర్‌లో 6.64 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. ఈ ఏడాది భూగర్భ జలాలు మరింత లోతుకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో భూగర్భజలమట్టం బాగానే ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

టమారా

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): బహిరంగ మార్కెట్‌లో టమాట ధర భారీగా పతనమైంది. హోల్‌సేల్‌లో కిలో రూ. 3 అమ్ముడుపోతుండగా, రిటైల్‌లో కిలో రూ. 5 విక్రయిస్తున్నారు. మొన్నటి వరకు కిలో రూ. 10 ఉండగా, ప్రస్తుతం సగం కూడా రావడం కష్టంగా మారింది. దీంతో టమాట రైతులు నష్టపోతున్నారు. పెట్టుబడిని సైతం కోల్పోయి దిగాలు చెందుతున్నారు. ఈ ఏడాది రైతులు అనుకున్నదానికంటే ఎక్కువ విస్తీర్ణంలో టమాట సాగు చేయడంతో నెలన్నర రోజులుగా మార్కెట్ కు పోటెత్తుతోంది. జిల్లాలో 2వేల ఎకరాల వరకు సాగు చేశారు. ఇతర జిల్లాల నుంచే వచ్చే టమాటతో పాటు జిల్లాలో స్థానికంగా పండించిన పంట కూడా చేతికి రావడంతో మార్కెట్‌లో డిమాండ్ లేకుండా పోయింది. అమ్ముడుపోగా మిగిలిన టమాలను సంతలో అక్కడే పారబోసి వెళ్తున్నారు. మరో నెల రోజుల వరకు ఇదే ధర కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కత్తితో ఆటోడ్రైవర్ హల్‌చల్



ఖలీల్‌వాడి: బేరం కుదరక ప్రయాణికులు మరో ఆటో ఎక్కినందుకు కోపంతో మొదట బేరం మాట్లాడిన ఆటో డ్రైవర్ వారిపై దాడి చేశాడు. నగరంలోని నాగారంలో డిసెంబర్ 31న రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. నాగారం ప్రాంతానికి చెందిన ఇద్దరు పూసలగల్లీలోని వస్త్రాల దుకాణంలో పని చేస్తున్నారు. డిసెంబర్ 31న రాత్రి పని ముగించుకొని నెహ్రూపార్క్ పోస్టాఫీస్ వద్ద ఆటో ఎక్కారు. నాగారం వెళ్లడానికి ప్రతి రోజు ఆటోకు రూ.10 ఇస్తామని, ఇప్పుడూ అంతే ఇస్తామని చెప్పారు. సదరు ఆటో డ్రైవర్ రూ.20 ఇవ్వాలనడంతో వేరే ఆటోలో వెళ్లారు. వారు ప్రయాణిస్తున్న ఆటోను వెంబడించిన మొదటి ఆటో డ్రైవర్ నాగారం వద్ద ఇద్దరు యువకులను పట్టుకొని రాడ్‌తో కొట్టాడు. విషయం తెలిసిన కాలనీకి చెందిన యువకులు అక్కడికి చేరుకోవడంతో కత్తి తీసుకొని దాడి చేయడానికి యత్నించాడు. ఆటో డ్రైవర్‌ను పట్టుకొని ఐదోటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.



కామారెడ్డిలోని పంచముఖి హనుమాన్ -శ్రీవెంకటేశ్వర ఆలయం వద్ద భక్తుల క్యూ..



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవేణుగోపాలస్వామి



శ్రీవేణుగోపాల స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

‘ముక్కోటి’ దర్శనం

కామారెడ్డి అర్బన్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోవింద నామస్మరణతో ఆలయాల పరిసరాలు ప్రతిధ్వనించాయి. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ప్రధానంగా జిల్లాకేంద్రంలోని పెద్ద బజార్‌లో గల ప్రాచీన శ్రీవేణుగోపాలస్వామి ఆలయంతో పాటు పంచముఖి హన్‌మాన్, శ్రీప్రసన్న వేంకటేశ్వరాలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రసన్న వేంకటేశ్వరాలయం వద్ద కిలోమీటరుకుపైగా బారులు కనిపించాయి. దేవునిపల్లి శ్రీవీరవెంకట రమాసత్యనారాయణ స్వామి, లింగాపూర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలూ కిటకిటలాడాయి. శ్రీరామకోటి జపలిఖిత ప్రచారకుడు కృష్ణానందస్వామి భక్తులతో శ్రీరామకోటి రాయించారు. జిల్లావ్యాప్తంగా వైష్ణవాలయాలలో సందడి కనిపించింది.

ఐదా? పదా..?

- పీఎంజీకేఏవైని మరో ఏడాది పొడిగించిన కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వ వాటాపై స్పష్టత కరువు
- ఇప్పటికీ రేషన్ షాప్‌లకు చేరని బియ్యం
- 5వ తేదీనుంచి పంపిణీ కష్టమే



సాక్షి, కామారెడ్డి: రేషన్ బియ్యం పంపిణీపై అయోమయం నెలకొంది. ఈనెల 5 నుంచి పంపిణీ మొదలుకావాల్సి ఉన్నా.. ఇప్పటివరకు స్పష్టమైన ఆదేశాలు రాలేదు. దీంతో సకాలంలో బియ్యం పంపిణీ ప్రారంభమయ్యే అవకాశాలు కనిపించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి ప్రారంభమైన సమయంలో పేదలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన(పీఎంజీకేఏవై)ను ప్రారంభించింది. ఈ పథకం కింద రేషన్ షాప్‌ల ద్వారా ఒక్కో యూనిట్‌కు ఐదు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేపట్టింది. ఈ పథకాన్ని పొడిగిస్తూ వస్తోంది. కేంద్రం ఇచ్చే ఐదు కిలోలకు రాష్ట్ర ప్రభుత్వం మరో ఐదు కిలోలు కలిపి పది కిలోలు ఉచితంగా లబ్ధిదారులకు అందించింది. కాగా ముందుగా ప్రకటించిన ప్రకారం కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యం పంపిణీ గడువు డిసెంబర్‌తో ముగియాల్సి ఉంది. అయితే కరోనా నేపథ్యంలో ఈ పథకాన్ని మరో ఏడాది పొడిగిస్తూ కేంద్రం ఇటీవల నిర్ణయం తీసుకుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే బియ్యం వాటా విషయమై ఇప్పటికీ స్పష్టత లేదు.

సాధారణంగా బియ్యం పంపిణీకి సంబంధించి ప్రతినెల ఒకటో తారీఖులోపే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందేవి. దానికి అనుగుణంగా రేషన్ దుకాణాలకు బియ్యం కేటాయించేవారు. ఐదో తేదీనుంచి బియ్యం పంపిణీ ప్రారంభమయ్యేది. మరో రెండు రోజుల్లో బియ్యం పంపిణీ మొదలు కావాల్సి ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో ఇప్పటికీ బియ్యం రేషన్ దుకాణాలకు చేరలేదు. దీంతో ఈ నెలలో బియ్యం పంపిణీ ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి.

జిల్లాలో 8,15,577 మంది లబ్ధిదారులు

జిల్లాలో ఆహార భద్రతా కార్డులతో పాటు అన్నపూర్ణ, అంత్యోదయ కార్డులన్నీ కలిపి 2,53,754 ఉన్నాయి. వాటిలో 8,51,694 మంది లబ్ధిదారులున్నారు. అయితే ఆహార భద్రతా కార్డుల్లో ఒక్కో యూనిట్‌కు ఐదు కిలోల చొప్పున కేంద్రం ఉచితంగా బియ్యం అందిస్తోంది. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఐదు కిలోలు, కేంద్రం ఐదు కిలోలు కలిపి ఒక యూనిట్‌కు పది కిలోల బియ్యం పంపిణీ చేశారు. కేంద్రం పీఎంజీకేఏవైని పొడిగించిన నేపథ్యంలో ఒక్కొక్కరికి పది కిలోలు ఇస్తారా, లేదా కేంద్రం ఇచ్చే ఐదు కిలోలకే పరిమితం చేస్తారా అన్న విషయం తేలాల్సి ఉంది. ఒక్కో యూనిట్‌కు పది కిలోలు పంపిణీ చేసినప్పుడు జిల్లాకు 13,337 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించేవారు. అయితే ఐదు కిలోల చొప్పున ఇచ్చే పక్షంలో 4,699 మెట్రిక్ టన్నులే రానున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వస్తేనే అయోమయానికి తెరపడే అవకాశాలున్నాయి.

సేవలను సద్వినియోగం చేసుకోండి

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్
- వర్చువల్ విధానంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రారంభం

కామారెడ్డి క్రైం: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 23 జిల్లా కేంద్రాల్లోని కోర్టు ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను ఆయన సోమవారం వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ద్వారా పేద ప్రజలు, ఒంటరి మహిళలు, నిరక్షరాస్యులు, ఆర్థికంగా వెనకబడిన వారికి ఉచిత న్యాయ సలహాలు అందుతాయన్నారు. ఈ విషయాన్ని అందరికీ తెలియజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరు న్యాయం పొందే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. అందరికీ సమాన న్యాయం అందేలా జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ద్వారా ఉచిత న్యాయ సేవలు, సహాయం అందిస్తామని పేర్కొన్నారు.



సంస్థ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

సంస్థను సంప్రదించాలి..

కామారెడ్డిలోని కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, శిక్షణ కలెక్టర్ శివేంద్రప్రసాద్, అదనపు జిల్లా న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ దుర్వ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమృత్‌రావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జడ్జీలు, కలెక్టర్, న్యాయవాదులు

ఔషధం కన్నా.. యోగా మిన్న

- భగవంతుడి ఆరాధనతో ఒత్తిడి దూరం
- మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అనేక రకాల వ్యాధులతో పాటు ఒత్తిళ్లను తట్టుకునేందుకు ఔషధం కన్నా యోగా సాధన ఎంతో ఉపయోగపడుతుందని మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా నిజామాబాద్‌లోని ఉత్తర తిరుపతి క్షేత్రానికి వచ్చిన స్వామీజీ సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రకృతిని ఆపే శక్తి ఎవరికీ లేదన్నారు. విపత్తులను, ఆందోళనలను, సమస్యలను ఎదుర్కొనే శక్తి కలగాలని భగవంతుడిని ప్రార్థించాలన్నారు. సమస్యలు వస్తే వాటిని ఎదుర్కొనేలా తయారు కావాలన్నారు. మానవాళికి అన్నం పెట్టే రైతులు ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. భగవంతుడిని స్తుతిస్తూ జీవన పోరాటం చేయాలన్నారు. అరెకరం భూమిలో సైతం, వానలు లేని ప్రాంతాల్లోనూ పంటలు పండించే అవకాశాలున్నాయన్నారు. ఇజ్రాయిల్ దేశంలో వర్షాలు లేనప్పటికీ పంటలు పండిస్తున్నారన్నారు. భగవన్నామ స్మరణతో ప్రజలు, పాలకుల్లోనూ మంచి బుద్ధి కలుగుతుందన్నారు. దేవుడు లేడనేవారు సైతం దేవుడి కారణంగానే బతుకుతున్నారన్నారు.



మాట్లాడుతున్న గణపతి సచ్చిదానందస్వామి

తిరుమల వేంకటేశ్వరుడి అనుగ్రహంతో..

తిరుమల వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతోనే నిజామాబాద్‌లో ఉత్తర తిరుపతి క్షేత్రం నిర్మాణం జరిగిందని స్వామీజీ పేర్కొన్నారు. అందరూ తిరుపతి వెళ్లలేనందున ఇతర చోట్ల ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయాలు నిర్మించామన్నారు. వైకుంఠ ఏకాదశిన ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే ప్రతి జీవికి భగవంతుడి అనుగ్రహం కలుగుతుందన్నారు. వ్యాధులు, కష్టాలను తట్టుకునే శక్తి దేవుడి ద్వారానే వస్తుందన్నారు. కోవిడ్ కారణంగా ప్రజల్లో క్రమశిక్షణ వచ్చిందన్నారు. కష్టం కలిగించాడంటే భగవంతుడు తగిన సందేశం ఇచ్చినట్లన్నారు.

వెన్నెల.. శిఖరం చేరేదెలా?

- కిలిమంజారో పర్వతారోహణకు ఎంపికైన గిరిపుత్రిక
- ఖర్చులకు రూ. 3 లక్షలు అవసరం
- సాయం కోసం ఎదురుచూపులు

సాక్షి, కామారెడ్డి: ప్రజల్ని చైతన్యవంతం చేసేందుకు ‘మట్టిని కాపాడుకుందాం’ అంటూ ఉమ్మడి రాష్ట్రంలో ఐదు వేల కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేసిన బానోత్ వెన్నెల కిలిమంజారో పర్వతారోహణకు ఎంపికైంది. అయితే ఆమెకు పేదరికం శాపంగా మారింది. అక్కడికి వెళ్లేందుకు రూ. 3 లక్షలు అవసరం కాగా.. పేదరికం కారణంగా అంత డబ్బు సమకూర్చుకోలేని ఆ గిరిపుత్రిక సాయం కోసం ఎదురుచూస్తోంది.

మాచారెడ్డి మండలంలోని సోమారంపేట రోడ్డుబండ తండాకు చెందిన బానోత్ వెన్నెల చిన్నప్పుడే తండ్రి మోహన్ చనిపోయాడు. తల్లి భూలి కూలి పనులు చేస్తూ నలుగురు పిల్లల్ని పెంచి పెద్ద చేసింది. వెన్నెల గతేడాది మట్టిని కాపాడుకుందామన్న నినాదంతో ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఐదు వేల కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర చేసింది. సైకిల్ యాత్ర పూర్తి చేసిన తర్వాత పర్వతారోహణపై దృష్టి సారించింది. ప్రస్తుతం కామారెడ్డిలోని సాందీపని జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న వెన్నెల.. ఎవరెస్టును అధిరోహించాలన్న లక్ష్యంతో శిక్షణ పొందింది. అన్ని పరీక్షల్లో సత్తాచాటి కిలిమంజారో పర్వతారోహణకు అవకాశం దక్కించుకుంది.

మారుమూల తండాలో గిరిజన కుటుంబంలో పుట్టి పెరిగిన వెన్నెలను ప్రోత్సహిస్తే మరో మలావత్ పూర్ణలా దేశ కీర్తిని ఎవరెస్టంత ఎత్తుకు చాటే అవకాశాలున్నాయి. దాతలు ముందుకు వచ్చి, చేయూతనిస్తే ఆమె అడుగులు ముందుకు పడనున్నాయి. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గిరిజన సంఘాల నేతలు, ఉద్యోగులు వెన్నెల వెన్నుతట్టి ప్రోత్సహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.





ట్రెక్కింగ్ చేస్తున్న వెన్నెల (ఫైల్), సైకిల్ యాత్రలో(ఫైల్)

శాపంగా మారిన పేదరికం

5,895 మీటర్ల ఎత్తున్న కిలిమంజారోను అధిరోహించడానికి ఇటీవల షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 19 నుంచి 28 వరకు కార్యక్రమం ఉంటుంది. అయితే పర్వతారోహణ కోసం రూ.3 లక్షల వరకు ఖర్చవుతాయని నిర్వాహకులు వెన్నెలకు లేఖ పంపించారు. పర్వతారోహణతో ఎవరెస్టంత ఎత్తుకు ఎదగాలని కలలు గన్న వెన్నెలకు.. పేదరికం అడ్డుగా మారింది. చేతిలో చిల్లిగవ్వ లేక, అంత డబ్బు సమకూర్చుకునే దారి తెలియక దిక్కుతోచని స్థితిలో ఉంది.

దాతలు సంప్రదించాల్సిన నంబర్

99087 66425
(ఫోన్ పే)

రెచ్చిపోతున్న రౌడీమూకలు

- పెచ్చుమీరుతున్న ఆగడాలు
- ఆందోళన కలిగిస్తున్న వరుస ఘటనలు
- ఒకటో, ఐదో, ఆరోటౌన్ పరిధుల్లోనే అధికం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాలో ఇటీవలి కాలంలో రౌడీ మూకల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. జిల్లా కేంద్రంలో వరుసగా చోటు చేసుకుంటున్న ఘటనలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఆదివారం రాత్రి ఇద్దరు రౌడీ షీటర్ల మధ్య జరిగిన ఘర్షణలో ఇబ్రహీం చావూస్ అలియాస్ జంగిల్ ఇబ్బు (29) హత్యకు గురికావడం నగరంలో కలకలం రేపింది. డిసెంబర్ 31వ తేదీ రాత్రి ఇద్దరు యువకులు ఆటోలో ఎక్కనందుకు డ్రైవర్ వారిని వెంబడించి రాడ్‌తో దాడిచేసి.. స్థానికులు అడ్డురాగా కత్తితో హల్‌చల్ చేశాడు. అలాగే గత నెలలో కోజా కాలనీలో అక్యూపంక్చర్ డాక్టర్ సల్మాన్‌పై ఉస్మాన్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. అంతకు రెండు రోజుల ముందే మాలపల్లిలో రౌడీషీటర్ కరీముల్లా మద్యం తాగి ఉన్నప్పుడు అతని స్నేహితుడు సలీం కనబడ్డాడు. డబ్బుల కోసం ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. రౌడీ షీటర్ కరీముల్లా కత్తితో సలీం గొంతుపై పొడవగా సలీం తన వద్ద ఉన్న బ్లేడ్‌తో కరీముల్లాపై దాడి చేశాడు. రెండేళ్ల క్రితం హత్య కేసులో నిందితుడు బీహార్ గౌస్ జైలు నుంచి విడుదల అయిన తర్వాత ధర్మపురి హిల్స్ ప్రాంతంలో తల్వార్‌తో తిరగడంతో స్థానికులు అడ్డుకున్నారు. దీంతో స్థానికులతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో జరిగిన పెనుగులాటలో బీహార్ గౌస్ దగ్గర ఉన్న తల్వార్ అతని కడుపులోనే గుచ్చుకొని మృతి చెందాడు. ఇలా రౌడీ షీటర్లు కత్తులు, ఇతర ఆయుధాలను పెట్టుకొని తిరుగుతున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఆ ప్రాంతాల్లోనే ఇల్లీగల్ దందాలు

నగరంలోని ఒకటో, ఐదో, ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాలపల్లి, సారంగపూర్, నెహ్రూనగర్, బాబా సాహెబ్ పహడ్, బోధన్ రోడ్డు, నాగారం ప్రాంతాల్లో ఇల్లీగల్ దందాలు జోరుగా సాగుతున్నాయి. పీడీఎస్ బియ్యం, గంజాయి, మట్కా, భూ మాఫియా, మామూళ్ల వసూళ్లు లాంటివి ఎక్కువగా జరుగుతాయి. ఈ దందాలపై పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ ప్రాంతాల్లోని ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని పోలీసుల దృష్టికి వచ్చినా పట్టించుకోవడంలేదని ఆరోపణలున్నాయి. పీడీఎస్ బియ్యం రవాణా చేసే వ్యాపారి పోలీస్ స్టేషన్‌లో జరిగే కార్యక్రమాలకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తారనే ప్రచారం ఉంది.



పోలీసులు ఈ ప్రాంతాలపై దృష్టి సారించి సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

రేపు బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

నిజామాబాద్ అర్బన్: ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికను బుధవారం ఉదయం 10 గంటలకు మామిడిపల్లి ఆక్స్‌ఫర్డ్ హై స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు మానస గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12 నుంచి 14 వరకు ఖమ్మం జిల్లా బోనాకల్‌లో జరిగే 67వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఉపన్యాస పోటీలు

నిజామాబాద్ అర్బన్: జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా ఈ నెల 4 బుధవారం ఉదయం 9గంటలకు నెహ్రూ యువ కేంద్రంలో ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారిణి శైలి బెలాల్ తెలిపారు. జిల్లా క్రీడా, యువజన విభాగం, నెహ్రూయువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలకు 15 నుంచి 29 ఏళ్లలోపు అర్హులని పేర్కొన్నారు. 3నిమిషాల్లో ఉపన్యాసాన్ని పూర్తి చేయాలన్నారు. దేశ భవిష్యత్‌లో యువత, ప్రజాస్వామ్య పరిరక్షణ, పరిపాలనలో యువత పాత్ర, డిజిటల్ ఇండియా అనే అంశాలపై మాట్లాడాల్సి ఉంటుందని, పేర్ల నమోదుకు 9100435410 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం నిజామాబాద్ జిల్లా జూనియర్ మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్ క్రీడకారులకు శిక్షణ శిభిరాన్ని ఏర్పాటు చేశారు. హ్యాండ్‌బాల్ అడ హక్ కమిటీ కన్వీనర్ పింజ సురేందర్, కో కన్వీనర్ రాజేశ్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోచ్ రాజేశ్వర్, పీఈటీ రాజేందర్, ప్రవీణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



మాక్లూర్ : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఓడిన క్రీడాకారులు నిరుత్సాహానికి గురికావొద్దని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సూచించారు. మండలంలోని మెట్టు గ్రామంలో 36వ క్రిస్మస్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విజేతలుగా నిల్చిన క్రీడాకారులకు పాస్టర్ రూబేన్ చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనుగు గంగాధర్, ఉపసర్పంచ్ యాకుబ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మేళా పరిశీలన



గాంధారి: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా భోదించాలని డీఈవో రాజు అన్నారు. మండలంలోని పోతంగల్ కలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి టీఎల్‌ఎం మేళాను ఆయన పరిశీలించారు. వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ప్రదర్శించిన భోధనా పరికరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మౌలిక సామర్థ్యాల ప్రగతి నమోదు చేశారు. జిల్లా సెక్టోరియల్ అధికారులు మనోహర్, వేణు, శ్రీపతి, ఎంఈవో సేవులా పాల్గొన్నారు.

నగరంలో అక్రమ నల్లా కనెక్షన్లు

- ఇంజినీర్లు, కార్పొరేటర్ల చేతివాటం
- మున్సిపల్ ఆదాయానికి గండి



నిజామాబాద్ సిటీ: నగరంలో అక్రమ నల్లా కనెక్షన్లకు అంతులేకుండా పోయింది. అక్రమ కనెక్షన్లు అరికట్టాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులే అడ్డదారులు తొక్కి దగ్గరుండి మరీ అక్రమంగా నల్లా కనెక్షన్లు పెట్టించటం గమనార్హం. నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో ఈ తంతాంగమంతా కొన్నేండ్లుగా సాగుతోంది. వీటిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో కొంతమంది కార్పొరేటర్లకు, ఇంజినీర్, లైన్‌మెన్లకు కాసులు కురిపిస్తోంది. నగరంలో ప్రస్తుతం ఉన్న ఇండ్లు, నల్లా కనెక్షన్లు ఉన్న ఇండ్ల సంఖ్యకు ఏ మాత్రం పొంతనలేకుండా పోయింది. మున్సిపల్ రికార్డుల ప్రకారం నగరంలో ప్రస్తుతం 90వేల వరకు ఇళ్లు ఉండగా, నల్లా కనెక్షన్లు అధికారికంగా 25,306 ఉన్నాయి. మరో 8 వేల కనెక్షన్లు రికార్డులకు ఎక్కించాల్సినవి ఉన్నాయి. ఇవే కాకుండా అక్రమంగా దాదాపు మరో 15వేల కనెక్షన్ల వరకు ఉండవచ్చని తెలుస్తోంది. కొంతమంది కార్పొరేటర్లు, ఏఈలు తాము పని చేసే ప్రాంతాలలో నల్లా కనెక్షన్లు కావాల్సిన వారి నుంచి రూ.10వేల వరకు వసూళ్లు చేసి వారికి అక్రమంగా కనెక్షన్లు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా అక్రమంగా ఇచ్చిన కనెక్షన్లు మున్సిపల్ రికార్డులో ఉండవు కాబట్టి వీరికి నీటి పన్ను ఉండదు. ఇలా కొన్ని ప్రాంతాల్లో అనేక సంవత్సరాలుగా నీటి ట్యాక్స్ చెల్లించకుండా మున్సిపల్ సరఫరా చేసే నీటిని ఉచితంగానే వాడుకుంటున్నారు. ఫలితంగా మున్సిపల్‌కు రావల్సిన ఆదాయం కొందరి కార్పొరేటర్లు, ఇంజినీర్లు, లైన్‌మెన్లు జేబులోకి వెళ్తుంది. నగరంలో అన్ని జోన్లు కలుపుకుని మొత్తం 33 వాటర్ ట్యాంక్‌లు ఉండగా, 33,306 నల్లా కనెక్షన్లు ఉన్నాయి.

అక్రమాలపై సీడీఎంఏకు ఫిర్యాదులు

నగరంలో నల్లా కనెక్షన్ల విషయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై సీడీఎంఏ(కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్)కు ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. దాంతో వీటిపై పూర్తి విచారణ చేయాలని ఇక్కడి ఇన్‌చార్జి కమిషనర్‌కు ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఇటీవల నగరంలో మున్సిపల్‌కు చెందిన నల్లా కనెక్షన్లు ఎన్ని ఉన్నాయో తెలుసుకునేందుకు ఇంటింటా సర్వే చేయాలని ఇన్‌చార్జి కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు గత వారం రోజులుగా నగరంలో నల్లా కనెక్షన్లు ఎన్ని ఉన్నాయో సర్వే నిర్వహిస్తున్నారు. సర్వేలో నల్లా కనెక్షన్ ఉన్నట్లు తెలిన వాటిని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రికార్డులకు ఎక్కిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 8వేల వరకు ఎక్కించాల్సి ఉండ గా, సిబ్బంది ఈ పనిలో నిమగ్నమయ్యారు. నల్లా కనెక్షన్లలో అక్రమాలకు పాల్పడిన వారిపై ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

విచారణ చేయిస్తాం

నగరంలో అక్రమ నల్లా కనెక్షన్లు ఉన్నట్లు మాకు తెలిసింది. దీనిపై మున్సిపల్ సిబ్బందితోనే సర్వే చేయించి లెక్క తేలుస్తున్నాం. అక్రమంగా నల్లా కనెక్షన్లు పెట్టుకుని ఉంటే వాటిని రికార్డులోకి ఎక్కించి వారికి బిల్లులు వేస్తాం. సిబ్బంది అక్రమాలకు పాల్పడితే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– ఆనంద్‌సాగర్, డిప్యూటీ ఈఈ

సుక్క.. ముక్క!

- డిసెంబర్ 31న రూ.11 కోట్ల మద్యం అమ్మకాలు
- శనివారం కావడంతో తగ్గిన మాంసం విక్రయాలు

ఖలీల్‌వాడి: కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ ప్రజలు మద్యం, మాంసంతో విందు చేసుకున్నారు. డిసెంబర్ 31న ఉమ్మడి జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. నిజామాబాద్ జిల్లాలో 102 వైన్ షాపులు, 20 బార్లు ఉండగా కామారెడ్డిలో 49 వైన్‌షాపులు, 8 బార్లు ఉన్నాయి. మాక్లూర్ మండలం మాధవనగర్ ఐఎంఎల్ డిపో నుంచి ఉమ్మడి జిల్లాకు మద్యం సరఫరా అవుతోంది. కొత్త సంవత్సరం కోసం ఎక్సైజ్ శాఖ బార్లు, వైన్స్‌లకు రెండు గంటలకు అదనపు సమయం కేటాయించింది. డిసెంబర్ 30, 31న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రూ.24.72 కోట్లు బీర్లు, లిక్కర్ అమ్మకాలు జరిగాయి. ఆదివారం ఐఎంఎల్ పాయింట్‌కు సెలవు కావడంతో ఎలాంటి లావాదేవీలు జరగలేవు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎక్సైజ్ అధికారులు రాత్రి వరకు ఐఎంఎల్ పాయింట్‌లో ఉండి మద్యం వ్యాపారులతో బీర్లు, వీస్కీ కోనుగులు చేయించారు. శుక్రవారం(డిసెంబర్30) రూ.13.72 కోట్లు కాగా శనివారం(డిసెంబర్ 31) రూ.11 కోట్లు మద్యం అమ్మకాలు జరిగాయి.

డిసెంబర్ 31 శనివారం రావడంతో మంసాహార విక్రయాలు తక్కువగా జరిగినట్లు వ్యాపారులు ద్వారా తెలిసింది. నిజామాబాద్ జిల్లాలో శనివారం 30 టన్నులు కాగా ఆదివారం 40 టన్నుల చికెన్ కోనుగోళ్లు జరిగాయి. నిజామాబాద్ నగరంలోనే 40 టన్నుల వరకు చికెన్ విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. మటన్ శనివారం 5 టన్నుల వరకు జరగగా ఆదివారం 15 టన్నుల వరకు అమ్మినట్లు సమాచారం.

విద్యార్థినిని దూషించిన ప్రిన్సిపాల్ భర్త

- పాఠశాలలో బంధువుల ఆందోళన
- ప్రిన్సిపాల్ భర్తను చితకబాదిన వైనం



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థిని బంధువులు

కామారెడ్డి టౌన్: ఫీజు విషయంలో అసభ్య పదజాలంతో విద్యార్థినిని దూషించిన ప్రిన్సిపాల్ భర్తను బంధువులు చితకబాదారు. ఈ ఘటన కామారెడ్డి స్టేషన్ రోడ్‌లో గల వాణి విద్యాలయంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. విద్యార్థిని, తల్లిదండ్రులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని ఫీజు బకాయి ఉండటంతో పాఠశాల ప్రిన్సిపాల్ భర్త సుభాకర్ ఆమెను పైన ఉన్న గదిలోకి పిలిపించుకుని అసభ్యపదజాలంలో దూషించాడని తల్లింద్రులు ఆరోపించారు. తాము ఫీజులు తప్పకుండా కడుతామని కానీ తమ బిడ్డను అనరాని మాటలు అనడం, అది కూడా ప్రత్యేక గదిలోకి పిలింపించుకుని అలా చేయడం దారుణమన్నారు. ఇంటికి వచ్చి తమ కూతురు భయానికి గురైందని వాపోయారు. విద్యార్థిని బంధువులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు ప్రిన్సిపాల్ భర్తను చితకబాదారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

టీచర్ వివాదాస్పద వ్యాఖ్యలు

ఆందోళనకు దిగిన బీజేపీ శ్రేణులు



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

కోటగిరి: 'దేవుడిని నమ్మొద్దు. సరస్వతి పూజ చేయొద్దు' అంటూ ఓ టీచర్ విద్యార్థులకు బోధించడం వివాదాస్పదంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. కోటగిరి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పనిచేసే తెలుగు టీచర్ దేవుడిని నమ్మవద్దని అప్పుడప్పుడు విద్యార్థులతో చెబుతుండేవాడు. సోమవారం కూడా దేవుడిని నమ్మొద్దని, సరస్వతి పూజ చేయొద్దని సూచించాడు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు పాఠశాలకు వచ్చి ఆందోళనకు దిగారు. బీజేపీ నాయకులు సదరు టీచర్‌ను హనుమాన్ ఆలయం వద్దకు తీసుకువెళ్లి నుదుటిన తిలకం దిద్దారు. టీచర్ క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

క్రైం కార్నర్

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

సిరికొండ: మండలంలోని కుర్దుల్‌పేట్ శివారులోని లక్ష్మి చెరువులో శనివారం గల్లంతైన మైలారం గ్రామానికి చెందిన కొండాపురం సంతోష్(46) మృతదేహం సోమవారం లభ్యమైంది. ధర్పల్లి సీఐ సైదా, ఎస్సై నర్సింలు సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చెరువులో ఈతగాళ్లతో గాలింపచేశారు. చెరువులో మోటారు ఏర్పాటు చేసి నీళ్లను బయటకు తోడి వేశారు. ఎంత ప్రయత్నించిన మృతదేహం లభించలేదు. మూడు గంటల సమయంలో మృతదేహం పైకి తేలింది. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో మరో యువకుడి..

రెంజల్: గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన యువకుడు మృతి చెందాడు. మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన మిద్దె నరేష్(34) రెండు రోజుల కిందట గోదావరిలో చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. సోమవారం నదిలో తేలిన మృతదేహాన్ని పోలీసులు జాలార్ల సాయంతో బయటకు తీయించారు. వలకు చిక్కుకుని మృతి చెందినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. రెంజల్ ఏఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా చేశారు. మృతుడి తండ్రి సాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జంగంపల్లి పులిచేరి కుంటలో..

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి పులిచేరి కుంటలో కుళ్లిన మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ సోమవారం తెలిపారు. కుంటలో మృతదేహం తేలడం చూసిన వారు భిక్కనూరు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఆనంద్‌గౌడ్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని ఒడ్డుకు తెప్పించారు. మృతదేహం పూర్తిగా కుళ్లి శరీరం గుర్తుపట్టలేనంతగా మారింది. మృతుడి జేబులో పందుల దుర్గయ్య (56), లొంక తండా సిరికొండ మండలం హాసున్‌నగర్‌న అని ఆధార్‌కార్డు లభ్యమైంది. దీంతో మృతదేహం దుర్గయ్యదిగా భావిస్తున్నామని ఎస్సై చెప్పారు.

చెన్నమ్మకొరి గుట్టల్లో..

నిజాంసాగర్: మద్నూర్ మండలం కొడిచెర శివారులోని చెన్నమ్మ కొరి గుట్ట ప్రాంతంలో సోమవారం కాలిన మృత దేహం లభ్యమైంది. మహారాష్ట్రలోని పుణేకు చెందిన శివశంకర్(48)ను అక్కడ హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడి తీసుకువచ్చి కాల్చినట్లు తెలిసింది. సగం కాలిన మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు మద్నూర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం ఆనవాళ్ల ఆధారంగా మహారాష్ట్ర పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పుణే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

విపత్తుల్లో ఎన్డీఆర్‌ఎఫ్‌ది కీలక పాత్ర



మాక్లూర్ : విపత్తులు సంభవించినప్పుడు తాము కీలక పాత్ర పోషిస్తామని జాతీయ విపత్తుల స్పందన దళం (ఎన్డీఆర్‌ఎఫ్) ఇన్‌స్పెక్టర్ బిట్వీన్ సింగ్ అన్నారు. సోమవారం మండలంలోని మాణిక్‌భండార్ గ్రామంలో జాతీయ విపత్తులపై ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సుకు బిట్వీన్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు, వెంకటేశ్, రాంబలి యాదవ్‌లు ప్రయోగాత్మకంగా ముఖ్యమైన సంఘటనలకు సంబంధించి చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శంకర్, ఎస్సై యాదగిరిగౌడ్, కార్పొరేటర్ రాజాసింగ్, ఆర్ఐ షఫీ, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 61 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 40 ఫిర్యాదులు రెవెన్యూశాఖకు సంబంధించినవి కాగా మిగితావి ఆయా శాఖలకు చెందినవి. కలెక్టర్, అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్‌డీవో సాయన్న, ఏవో రవీందర్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో 81 ఫిర్యాదులు

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్య తనిస్తూ పెండింగ్ ఉన్న అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 81 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ చందర్, జెడ్పీ సీఈఓ గోవింద్ వినతులు స్వీకరించారు.

వసతులు కల్పించాలి

వెల్‌నెస్ సెంటర్‌లో అన్ని వసతులు కల్పించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. వెల్‌నెస్ సెంటర్‌ను ఈఎస్ఐ ఆస్పత్రిలోకి మారుస్తున్నట్లు కలెక్టర్ తెలిపారని వారు చెప్పారు. రామ్మోహన్‌రావు, మదన్‌మోహన్, ఈవీఎల్ నారాయణ, సుదర్శన్ రాజు, అందె సాయిలు, ప్రసాద్‌రావు, రాధాకిషన్, పుండరీ, రామదాసు పాల్గొన్నారు.

'డబుల్' ఇల్లు మంజూరు చేయాలని వినతి

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ముంపు బాధితుడినైన తనకు ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని ముప్కాల్ మండలం నాగంపేట్‌కు చెందిన గజ్జెల సురేందర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కమ్మ సంఘం ఎన్నిక చెల్లదు

- సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణారావు
- రెండు వర్గాలుగా చీలిన కమ్మ సంఘం



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: రెండురోజుల క్రితం జిల్లా కమ్మ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎన్నిక చెల్లదని జిల్లా కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి కాపూరి కృష్ణారావు అన్నారు. సోమవారం మాధవనగర్ కమ్మ సంఘంలో ఆయన మాట్లాడుతూ సంఘంలో మొత్తం 15 మంది డైరెక్టర్లు, ఆరుగురు కో ఆప్షన్ సభ్యులు ఉండగా, రెండు రోజుల క్రితం మరో వర్గం వారు 8 మంది డైరెక్టర్లు, ముగ్గురు కో ఆప్షన్ మెంబర్లతో సమావేశాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాటు చేసుకుని కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రకటించారని తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా కొనసాగిన సుబ్బారావు నవంబర్ 26న అధ్యక్ష పదవికి రాజీనామా చేసి నిన్నటి ఎన్నికల్లో ఏ హోదాలో ఓటింగ్‌లో పాల్గొన్నారని ప్రశ్నించారు. నూతనంగా ఏర్పడిన కార్యవర్గం తనను ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించిందని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించటం చెల్లదన్నారు. ఈ నెల 8న కమ్మ సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని, సమస్యలు ఉంటే వాటిపై చర్చించి కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకుందామన్నారు. కమ్మ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మండవ రామకృష్ణ మాట్లాడుతూ సంఘంలో ఏమైనా సమస్యలు ఉంటే రెండు గ్రూప్‌ల సభ్యులు జనవరి 8న జరిగే సమావేశానికి హాజరై గొడవలు పడకుండా సమస్యలను శాంతియుత వాతావరణంలో పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా కమ్మ సంఘం సహాయ కార్యదర్శి వెలిగల సురేష్, డైరెక్టర్లు రవీంద్రనాథ్ ఠాగూర్, గండు రాములు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా..

- ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు జేఈఈ, నీట్, ఎంసెట్ శిక్షణ
- సోమవారం నుంచి ప్రారంభమైన తరగతులు



భీమ్‌గల్‌లో ఎంసెట్ శిక్షణనిస్తున్న అధ్యాపకుడు

నిజామాబాద్‌అర్బన్: జేఈఈ, నీట్, ఎంసెట్ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఈ ఏడాది నుంచి సెకండియర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఆయా పరీక్షల కోసం కోచింగ్ ఇస్తున్నారు. ఈ శిక్షణ తరగతులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో మొదటి సంవత్సరంలో 4,353 మంది రెండో సంవత్సరంలో 3,955 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంటర్ ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు ప్రవేశ పరీక్షల్లో రాణించలేకపోతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారులు ఈసారి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో సోమవారం నుంచి ఈ ప్రత్యేక తరగతులను ప్రారంభించామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి రఘురాజ్ తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం ఎంసెట్, నీట్, జేఈఈ పరీక్షలకు సిద్ధం చేయనున్నారు. శిక్షణతో పాటు ప్రత్యేకంగా మెటీరియల్, పుస్తకాలను కూడా అందజేస్తున్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి, నిష్ణాతులైన అధ్యాపకులతో ఎంపిక చేసిన విద్యార్థులకు రెసిడెన్షియల్ కళాశాలలో మరోసారి ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు.

వార్షిక పరీక్షలకు..

మార్చి 15 నుంచి జరగబోయే ఇంటర్ వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వెనుకబడిన వారిని గుర్తించి ఉదయం 9 గంటల నుంచి 9.45 వరకు సాయంత్రం 4.30 నుండి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నారు. ఫిబ్రవరిలో ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని కళాశాలలో శిక్షణ ఇస్తూ విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఇది వరకే ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది హాజరు నమోదు చేసేందుకు బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని ఇంటర్ బోర్డు ఇది వరకే సూచించింది. దీంతో అధికారులు ఒక్కో కళాశాలకు రెండు బయోమెట్రిక్ మిషన్లు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక దృష్టి..



ప్రభుత్వ కళాశాలల్లో ఎంసెట్, నీట్, జేఈఈ పరీక్షలకు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. అలాగే మంచి ఫలితాల కోసం ప్రత్యేక దృష్టి సారించాం. ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు చేపడుతున్నాం.

– రఘురాజ్, డీఐఈవో

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సిరికొండ : జాతీయస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు పీఈటీ నాగేశ్ తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి కంచర్ల అక్షయ, బాదావత్ శ్రీజ, బాదావత్ అఖిల(స్టాండ్‌బై) ఎంపికయ్యారన్నారు. జాతీయస్థాయి పోటీలు ఈనెల చివరి వారంలో ఢిల్లీలో జరుగుతాయని తెలిపారు. విద్యార్థినులను సర్పంచ్ బాలమణి, మల్లేష్, ఎంపీటీసీ లింగం, హెచ్‌ఎం సత్యం, జిల్లా హాకీ సంఘం ప్రతినిధులు అభినందించారు.

ఇల్చిపూర్‌లో దొంగల కలకలం!

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దొంగల అలజడి గ్రామస్తులను భయాందోళనకు గురిచేసింది. గ్రామస్తులు ఓ గుర్తు తెలియని వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ధర్ని మధు ఇంటి తలుపులను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నెట్టడంతో కంగారు పడి చుట్టుపక్కల వారికి ఫోన్ చేశాడు. దీంతో స్థానికులు పోగయ్యారు. ఇంతలోనే మధు ఇంటి ఎదురుగా ఉన్న మల్లయ్య ఇంట్లో శబ్దాలు రావడంతో అందరూ కలిసి అటుగా వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు మల్లయ్య ఇంట్లో ఉండగా వారిని పట్టుకునేందుకు యత్నించారు. వారిలో నుంచి కొందరు పరారు కాగా ఓ వ్యక్తిని పట్టుకున్నారు. వారం క్రితం టేక్రియాల్, ఇల్చిపూర్ పంట పోలాల శివారులలో కూ డా అనుమానాస్పదంగా వ్యక్తులు తిరుగుతూ వ్యవసాయ బా వుల వద్ద కేబుల్ వైర్ల చోరీకి ప్రయత్నించినట్లు గ్రామస్తులు చె బుతున్నారు. పట్టుకున్న వ్యక్తిని పోలీసులకు అప్పగించారు.

'అయ్యప్ప స్వాములకు సహకరిస్తా'



మాట్లాడుతున్న ధన్‌పాల్



మహాపడిపూజ నిర్వహిస్తున్న భక్తులు

సుభాష్‌నగర్ : నగరంలో వాడవాడలో అయ్యప్ప పూజలు నిర్వహించడం తన పూర్వజన్మ సుకృతమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త పేర్కొన్నారు. సోమవారం నగరంలోని దుబ్బ అరుంధతినగర్‌లో ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్‌గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. మాల వేసుకునే వారు తనను, డివిజన్ నాయకులను సంప్రదిస్తే పూర్తి సహాయ సహకారాలు అందించి, శబరిమల యాత్ర పూర్తి వరకు అన్ని ఖర్చులు తానే భరిస్తానని హామీనిచ్చారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడో మహా పడిపూజ నిర్వహించామన్నారు. అనంతరం అరుంధతినగర్ అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు ఆయనను సన్మానించారు. నారాయణ, శివప్రసాద్, దీపక్, సుభాష్ జాదవ్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, భరత్ భూషణ్, గంగాధర్, వినోద్, భాస్కర్‌రెడ్డి, ఆగమయ్య, పార్శి రాజు, రవి, విజయ్ పాల్గొన్నారు.

బోధన్‌లో యువకుడి దారుణహత్య



మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు



శివ (ఫైల్)

బోధన్‌టౌన్: బోధన్ పట్టణం శక్కర్‌నగర్ – నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కన పొదల్లో చాట్ల శివ(23) అనే యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. సీఐ ప్రేమ్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని శక్కర్‌నగర్ శాంతినగర్ కాలనీకి చెందిన చాట్ల శివ తల్లిదండ్రులు నిజామాబాద్‌లో ఉంటారు. శివ కూడా నిజామాబాద్‌లో ఉంటూ శాంతినగర్‌లోని తమ ఇంటికి అప్పుడప్పుడు వస్తుంటాడు. కొన్ని రోజులుగా శాంతినగర్‌లోనే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో శివ ఇంట్లో బయటకు వెళ్లడం చూసినట్లు స్థానికులు తెలిపారు. కాగా సోమవారం ఉదయం శక్కర్‌నగర్– నర్సాపూర్ ప్రధాన రోడ్డు పక్కన గల చెట్లలో యువకుడి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. యువకుడి మెడను, కుడి చేతి మణికట్టును కోసి హతమార్చారు. కళ్లలో సైతం పొడిచారు. డాగ్‌స్కాడ్, క్లూస్ టీంతో పోలీసులు ఆధారాలు సేకరించారు. మృతుడి తండ్రి చాట్ల గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

రెంజల్: మండలంలోని వీరన్నగుట్ట తండాకు చెందిన జాదవ్ శాంతబాయి(45) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పండ్ల సాయన్న తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. భర్త ప్రేమ్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.